# కారాగృహ కవాటము

[ కథానిక ]

శ్రీ కవికొండల వెంకటరావు

"నీవు దొంగచాటుగా నాకు ఇచ్చే ముద్దు నేను తీసికోనూలేను: నేను దొంగచాటుగా నీకు యీ చెట్టుయొక్క పువ్వు కోసియివ్వనూ లేను. నేను ఖైదీని; అస్వతంత్రుణ్ణి."

"నీవు దొరగారి తోటమాలివి కావూ? అస్వతంత్రుడివా?"

"ఈదొరగారికి తోటమాలీలంటూ వేరే లేరు. దొంగలే తోటమాలీలు."

"ఐతే నీవెప్పుడుమఱి విడుదల అయ్యేది?"

"ఎందుకు? నీ కాఊసు?"

"ఊరికేనే."

"మూడురోజుల్లో."

"ఈరోజు కలిపా?"

"ఊఁ."

"ఊఁ" అని ఖైదీ అన్నాడో లేదో జైల్లో సాయంకాలం నాలుగు కొట్టారు. జైలు సూపరింటెండెంటు దొరవారి బంగాళా ముంగిటి పూలతోటయొక్క దక్షిణపు కంచెవార పొగడమొక్కకు నీళ్లు పోస్తూవున్న ఆ ఖైదీ రెండుకుండలూ పూర్తిగా వంచి నీళ్లు వెలలించినవాడై కావిడి ఉత్తిది ఊపుకుంటూ, తన్ను కంచెఆవలినుండి పలకరించిన పిల్లవైపు కనుగిలుపుమాత్రంగానైనా చూడకుండా జైలుఘంట మ్రోత చెవులు దోరెట్టుకు వింటూ, తక్కుంగల ఖైదీలోకకొందర్ని తనలాంటివార్ని కలిసికొని, తిన్నగా రాజమార్గం దాటుకుంటూ దైనందిన కార్యక్రమాన్ని అనుసరించి జైల్లోకి తరలిపోయినాడు.

ఆక్షణాన్ని అతణ్ణి ఆవరించి అతనినుండి క్రమక్రమంగా జారిపోయినవి అల్లా పిల్ల కళ్లున్నూ, ఆకళ్లముందు పొగడచెట్టునుండి పిల్లగాలికి రాలి అతనిమీద అతనికి తెలియకుండా పడ్డ యొకకొన్ని పువ్వులున్నూ.

పూల నెవరైనా లెక్కపెట్టారా? పిల్ల నెవరైనా కనిపెట్టారా? అసలు జైలుకూ బంగాళాకూ దూర మెంత? ఆదూరంలో రాజమార్గమన్న దెంత? ఇదంతా యెవరైనా ఊహించేరా?

* * *

పై సంభాషణ జరిగింది సోమవారం అనుకోండి. సోమవారం లేదు, మంగళవారం లేదు, బుధవారం పొద్దున్నే జైల్లో ఆరున్నొకటి కొట్టేసరి కల్లా జైలుముందు రాజమార్గంమీద పిల్ల కనిపెట్టు కూర్చునివుంది, కొంచెం వారగా మఱ్ఱిచెట్టుక్రింద. పల్లెపల్లెలనుంచి పాలు, అపరాలు నెత్తినెట్టుకువచ్చే జనం తెల్లాఱకుండానే పట్నంలో ప్రవేశించివుండడంచేతనూ, కొత్తగా జైల్లోకి చేరుకోవలసినవాళ్లు అప్పటికప్పుడే జైలుఆవరణలోకి గొంపోబడివుండడం

చేతనూ ఆపరిసరప్రాంతం అంతా నిర్మానుష్యంగా వుంది. మఱిన్నీ నిశ్శబ్దంగా వుంది. ఏదన్నా కూస్తే అది గోరింక! ఏదన్నా పలికితే అది చిలక! కోయిలొకటి రావిచెట్టు తుదవ్రాలింది కాని వాయి విప్పనా మాన్నా అని సంకోచిస్తూవుంది. బహుశా గొంతు సవరించుకుంటూ వుందేమో మంచిపాట పాడ్డానికి. ఎందుకు కాకూడదూ? హేమంత ఋతువును, వసంతఋతువును కేటాయించడానికి వీల్లేని దోసందు సుఖవాసరాలవి. కోయిల మఱి తన గొంతు చక్కబఱచుకోకుండా వుంటుందా? అచిరకాలంలో ఎందుకు పాడకుండా వుంటుంది?

విడుమర గన్న మన ఖైదీ కారాగృహకవాటం తెరపిని అప్పుడే కనిపిస్తూవున్నాడు. అతనివొంటిని సోమవారంనాడున్న మాదిరి చడ్డీ, బనీను, టోపీ-అన్నీ వొకేరంగు తెల్లటి దుస్తులుగా కనిపించేవి బుధవారం ప్రొద్దున్న లేవు. అతనప్పటికప్పుడే వేసికొన్న దిరీసు అదోరకపు సొంత దిరీసు. కట్టాడు గ్లాస్గో మల్లు పంచె; తొడిగాడు కాసులబొత్తాముల చొక్కా; చుట్టాడు గులాబిరంగు కోరపాగా; నడుచుకుంటూ వస్తున్నాడు రాచమార్గంకేసి. "అదృష్టవంతుడివి: విడుమర గన్నావు" అని విడివడని ఖైదీలు అభినందించేరు. "ఈ పైనుంచి అయినా బుద్ధిగలిగివుండు" అని అధికారులు నీతి గరపేరు. ఏదీ అతగానికి అవలోడనం గావడం లేదు. జైల్లోనుంచి ఆవల పడతానా లేదా అనే ఆందోళనే! ఆవల పడ కేంచేస్తాడు విడివడ్డాక? అతగానికి తోచడం లేదు ఆముక్క. తోచడం లేదు కదా, కవాతు చేసేవాళ్లు 'బెయొనెట్లు' గల తుపాకులు సూర్యరశ్మిలో పైకెత్తినప్పుడు కవాతు చెప్పే యుద్యోగి 'ఎటెన్షన్'అని అఱచినప్పుడు, మనవాని హృదయం 'హూ'త్తన్నట్టు బెదరిపోయింది, మనవాని కళ్లు వూదబడ్డట్టు దృష్టి చెదరించుకొనివి. ఇదంతా ఎంతసేపు? పదినిమిషాలు. మనం మనం అతగాడేం నేరం చేసివుంటాడూ, అసలెంతకాలం శిక్షపడ్డాడూ, ఆ యిచ్చింది న్యాయమైన తీర్పేనా అని విమర్శించుకొన్నంతకాలంకూడా పట్టలేదు.

జైలుఆవరణ దాటుకొచ్చి వొక్కడూ— ఆ పిల్లయొక్క మనోనాయకుడు అని అందామా?— ఆ అందగాడు రాజమార్గం మీద రాణించాడు.

ఎఱ్ఱని రస్తామీద ఎండ బాగా ప్రసరించివుంది. చెట్లనీడలు తమకు తామే అతనిముందు వొత్తిగిల్లినట్టుగా ఓ వెంపుకు తప్పుకున్నాయి. ప్రకృతికి లోపలా వెలపలా కూడా చాటూ మాటూ లేనట్టు అంతా వెల్తురుమయంగా, బాగనబయలుగా అగపిస్తూ వుంది.

తన తెట్టతెన్నునే పిల్లను చూచాడు. పిల్ల పడుచుపిల్ల. ఎంతో సింగారంగా కట్టుకొచ్చిన ఆకుపచ్చరంగు చీరచెంగు జారు చటుక్కున సర్దుకుంది. ఆ సర్దుకోవడంలో విలాసంగా మెఱయించింది లోతట్టు పట్టంగట్టుకొనియున్న మెదపుట్టువులమీది ఎఱ్ఱరంగు జంపర్. దాడిమీకోరకమా? బంధూకకందుకమా? సంధ్యాప్రబంధమా?

* * *

"ఇప్పుడు నీ వెందుకిక్కడకు వచ్చావు?"

"ఈవేళ నిన్ను విడిచిపెడతారన్నావుగా?"

"అన్నానా?"

"అన్నావ్."

"అంటే?"

"ఇప్పుడు నన్ను ప్రేమించడానికి నీకేమిటి అభ్యంతరం?"

"ప్రేమ? అది ఈ కారాగృహమం దుంచబడకపూర్వ మేమైనా మనుపూ ముందూ ఉండేదేమో నా గుండెల్లో ఎక్కడన్నా దాగుండి. కనికరించి ఎప్పుడైనా వొకానొక బాటసారిని దోచుకోకుండా విడిచి పుచ్చివున్నానేమో? ఇప్పు డది పూర్తిగా నాయందు వమ్మైనది. ప్రేమ? ప్రేమ? ప్రేమ?"

* * *

పిల్ల చకితమై కన్ను లప్పళించుకుంటూ తనకొంగున కట్టుకొచ్చిన యొకానొక చిన్న పొగడపూల దండను ఆమాత్రపు పదిపద హారుపువ్వు లున్నదాన్ని ముడివిప్పి తీస్తూ గద్గదికగా "మణి, మణి, మణి ఈపూలదండ నెవరిదండ కెక్కించను?" అని అడిగింది.

"ఏపూలదండ?" అని అడిగాడు విడివడ్డఖైదీ.

"ఇదిగో! ఇదీ! అరదండాలవంటిది గాదు. ఒక్క నిండుదండ, నీకైంది గుచ్చితెచ్చాను, ఇదిగో!" అని అతనిమణికట్టునుంచిన్నీ అది గమనించబోయింది పడుచు. అత డా మణికట్టు సొంతశరీరపు వెన్నెముకకు హత్తుకుంటూ నిలువునా వీరోచితుడై నివ్వెరపోతూ "ఎక్కడివీ పువ్వులు?" అని ప్రశ్నించాడు. ఆకోమలి యిట్లు బదులాడసాగింది: "మొన్న నీవు నీళ్లు పోసిన చెట్టువి. ఆచెట్టు నీమీద తనపువ్వుల్ని విరజిమ్మిందిగా! వాటిని నీవు దారిపొడుగుతా దులుపుకుంటూ నడచిపోతివిగా జైల్లోనికి? రాజమార్గమును దాటుకుంటూ? నేను నీ వెంబడినే వచ్చి, వెంటవెంటనే, నీనుండి రాజమార్గమ్మీద విడివడిన పదపదహారు పువ్వుల్నీ ఏరుకు ఇంటికి గొనిపోయి ఈ ప్రకారంగా దండగ్రుచ్చి తెచ్చాను" అంది అతి అమాయకంగా.

అంటూ వున్న పడుచును తప్పుకోమని ఆ నాయకుడు తన నెత్తిమీది కోరపాగాను అట్టె తీసివేసికొన్నవాడై "పిల్లా! నీ మేలు మఱువజాలు! జ్ఞప్తికి దెచ్చినావే నే పెంచిన మొక్కను! నేను నీళ్లుపోసిన చెట్టును! అది పూచినదా? ఆహా! పూచి నాపైని పూవుల్ని రాల్చినదా? ఆపువ్వులేనా యివి?" అంటూ ఆదండను తనదోసిటిలో పెట్టుకుని కళ్ల నద్దుకుంటూ "నాతో చెప్పకుండా నామీద తన కుసుమా లిన్నింటి నభివర్షించిన తరువు నెంతని కొనియాడగలను? దానిని నేను తిరిగి చూడనుగదా? చూడనుగదా? అదేనా దానికొమ్మ? అదేనా దాని రెమ్మ? అదేనా? అదేనా?" అని మునివ్రేళ్లమీద మిక్కిలీ ఎత్తరై ఆ మోకను చూస్తూ వేడి కన్నీళ్లు విడిచాడు.

ఆపురుషుణ్ణి ఆముహూర్తమందు అనునయింపగలిగింది దగ్గర్లో వున్న తరుణ స్త్రీ కానే కాదు. వాని పొగడచెట్టుమీది కెక్కడినుంచో ఎగిరివచ్చి అప్పుడే వ్రాలి ఆనవాలు గొలుపుతూ పాడిన కొదమకోయిలయొక్క నిరంతరవియోగగీతి! నిరంతరవియోగగీతి! ఆ నిరంతరవియోగగీతి యొక్కటే ఆముహూర్తమం దా పురుషుణ్ణి అనునయింపగలిగింది.